క్లుప్తంగా

లబ్ధిదారుల వద్ద తీసుకున్న కమీషన్ తిరిగి ఇవ్వాలి

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండ గ్రామంలో దళిత బంధు లబ్ధిదారుల నుంచి రూ.2లక్షల నుండి రూ.3లక్షల వరకు తీసుకున్న కమీషన్ డబ్బులను వెంటనే తిరిగి లబ్ధిదారులకు ఇవ్వాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో పలువురు లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. దీంతో లబ్ధిదారులు వారికి జరిగిన అన్యాయాన్ని ఆయనకు వివరించారు. లబ్ధిదారులకు రావాల్సిన పలు యూనిట్లలో ఎంపీపీ అనుచరులు వాటాలు తీసుకున్నారని ఆయన విమర్శించారు. ప్రశ్నించిన వారిని బెదిరించడం సరికాదని అన్నారు. తీసుకున్న డబ్బులు వెనక్కి ఇవ్వకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చెపడతామని హెచ్చరించారు.

బీసీబంధు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : దళితులకు దళిత బంధు ఇచ్చిన మాదిరిగానే బీసీలకు కూడా బీసీ బంధు రూ.10 లక్షలు ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు బుధవారం పత్రిక ప్రకటనలో కోరారు. బీసీలకు రూ.1 లక్ష ఇస్తే ఏ వ్యాపారానికి సరిపోతాయని ప్రశ్నించారు. రూ.1 లక్ష కేటాయించడం అంటే బీసీలను అవమానించడమేనని ఆయన అన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న

మఠంపల్లి : మండలంలోని పెదవీడులో నిరుపేద కుటుంబానికి చెందిన ముత్యాల బ్రాహ్మాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి ఓజో ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో రఘున్న చేయూత ద్వారా రూ.5వేల ఆర్థికసాయాన్ని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న బాధిత కుటుంబానికి అందజేశారు. ఓజో ఫౌండేషన్ సభ్యులు శివ, శంకర్, సైదులు, చందర్, రమేష్, సాయిబాబా, తదితరులు ఉన్నారు.

కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకోవాలి

నడిగూడెం: వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం కొనసాగించే 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల పేదలకు ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థికసాయం చేయనున్నదని తెలిపారు. అర్హత ఉన్న లబ్ధిదారులు ఈ నెల 9 నుంచి మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న ఉద్యోగస్తులు

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ) పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన అమ్మమ్మగారి గ్రామమైన ముకుందాపురంలోని పలువురు ఉద్యోగస్తులు బుధవారం ముకుందాపురం శివారులోని ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు రెణబోతు అప్పిరెడ్డి, బోళ్ల శ్రీధర్‌రెడ్డి, బోళ్ల సైదిరెడ్డి, పందిరి బ్రహ్మారెడ్డి, అన్నదాన నిర్వాహకులు విలాసకవి వేణుగోపాల రాజు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

భోజనం పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం దాదాపు 300 మందికి సరిపోయే భోజనం మిగిలింది. దీంతో ఈ విషయాన్ని ఫంక్షన్ నిర్వాహకులు డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ డి.బాబురావుకి తెలపడంతో ఆయన తమ బృందం సభ్యులతో కలిసి ఆ భోజనాన్ని తీసుకెళ్లి పేదలకు పంచి వారి ఆకలి తీర్చారు. కార్యక్రమంలో సభ్యులు కె.ప్రేమ్‌చంద్, కె.మహేష్, రాజి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లయ్యకు మెడల్


కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు కాళేశ్వరం జలానికి- లక్ష జనహారతి మెమొంటో, మెడల్, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వండర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్

నిరుపయోగంగా భవనాలు

- ఏళ్లు గడుస్తున్నా ఇతర శాఖలకు కేటాయించని అధికారులు
- వృథా అవుతున్న లక్షల రూపాయల ప్రజాధనం


నిరుపయోగంగా స్త్రీశక్తి భవనం


గృహ నిర్మాణ శాఖ కార్యాలయ భవనం

నడిగూడెం : మండలంలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. మండల కేంద్రంలో పదేళ్ల కిందట ఎస్‌ఎస్పీ స్థలంలో రూ.20 లక్షల వ్యయంతో స్త్రీ శక్తి భవనం నిర్మించారు. కాగా ఆ శ్రీ శక్తి భవనంలో మూడేళ్ల క్రితం వరకు జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది విధులు నిర్వర్తించారు. అయితే మూడేళ్ల కిందట మండల పరిషత్ అధికారి ఉపాధి సిబ్బందిని మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించాలని ఆదేశించడంతో గత నాలుగేళ్లుగా ఉపాధి హామీ పథకం సిబ్బంది మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో శ్రీశక్తి కార్యాలయ భవనం వృథాగానే ఉంటోంది. అలాగే ఐదు లక్షల రూపాయల వ్యయంతో గృహనిర్మాణ శాఖ కార్యాలయం భవనం నిర్మించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని మరొక శాఖకు బదిలీ చేయడంతో గత పదేళ్లుగా ఆ భవనం నిరుపయోగంగానే ఉంటోంది. అలాగే నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత కార్యాలయం కూడా గత పదేళ్లుగా నిరుపయోగంగానే మారింది.

మూతబడిన పాఠశాలలు..

మండల పరిధిలోని కరివిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంకట్రాంపురం ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రంలోని బస్టాండ్ వెంట ఉన్న ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాదిగా విద్యార్థుల సంఖ్య లేకపోవడం ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపారు. దీంతో గత ఏడాది కాలంగా ఆ పాఠశాలలు మూతబడ్డాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల భవనాలను ప్రజల అవసరాన్ని బట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్, గృహ నిర్మాణ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలి. – థామస్, నడిగూడెం

రాములోరి గుళ్లో ప్రమాణం చేసేందుకు సిద్ధమా


సమావేశంలో మాట్లాడుతున్న తూమాటి వరప్రసాద్‌రెడ్డి, నాయకులు

కోదాడరూరల్ : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని విమర్శించే స్థాయి ఎంపీపీ చింత కవితకు లేదని, స్థాయికి మించి మాట్లాడటం తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండలో దళిత బంధు బాధితులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో దళితబంధు లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకోలేదని తడి బట్టలతో రాములోరి గుడి వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధమా అని ఆయన ఎంపీపీకి సవాల్ విసిరారు. మీ గ్రామంలో దళితబంధు పంపిణీలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించరా అని పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులే తనను ఫోన్ చేసి అడిగారన్నారు. లబ్ధిదారులే స్వయంగా తమ వద్దకు వచ్చి వారిని డబ్బుల కోసం పెట్టిన ఇబ్బందులను చెప్పుకుంటున్నారని తెలిపారు. లబ్ధిదారులే స్వయంగా దళితబంధు మంజూరు కోసం డబ్బులు తీసుకున్నారని చెబుతుంటే ఆధారాలు చూపించమనడం హాస్యస్పదంగా ఉందన్నారు. నాలుగేళ్లల్లో నీవు సంపాదించిన ఆస్తులు ఎంటో గ్రామ, మండల ప్రజలకు తెలుసన్నారు. మట్టి, రియల్ వ్యాపారుల వద్ద కమీషన్‌లు తీసుకుంటున్న మాట వాస్తవం కదా అని ప్రశ్నించారు. పలువురు భూములను ఆక్రమించుకొని వారిపై కేసులు పెట్టించారని విమర్శించారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తమ వద్ద ఖాళీ బాండ్ పేపర్‌లపై సంతకాలు చేయించుకున్నారని, ఆ తర్వాత డబ్బులు తీసుకున్నారని వాపోయారు. డైరీ ఫాం యూనిట్‌కు 8 గేదెలు వస్తే నాలిగింటిని ఎంపీపీ అనుచరుడు తీసుకెళ్లాడని ఆరోపించారు. తమ సంతకాన్ని ఫోర్జరీ చేసి గత నెలలో లక్ష.8 వేల దాణా బిల్లును వారి ఖాతాలోకి మళ్లించుకున్నారన్నారు. కార్యక్రమంలో కుక్కడపు సైదులు, ఇర్ల నర్సింహారెడ్డి, లబ్ధిదారులు గొర్రెముచ్చు సిద్ధయ్య, మాదాసు శ్రీను, వెంకయ్య, పులి రాజారావు, గామయ్య, రమణ, జ్యోతి, శ్రీను, వెంకటేశ్వర్లు, కేసుబాబు తదితరులు ఉన్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ


నేరేడుచర్లలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

నేరేడుచర్ల : చేపలు ఆరోగ్యవంతమైన ఆహారమని, చేపలలో మాంసాకృతులు పుష్కలంగా లభిస్తాయని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు తిక్కల శ్రీకాంత్ అన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో నిర్వహించబోయే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను బుధవారం నేరేడుచర్లలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. ఫిష్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగబోయిన రామకృష్ణలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ మండల యూత్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, నాయకులు శ్రీను, అలివేలు, రామారావు, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, సాంబయ్య, గోపి, శ్రవణ్, సాయి తదితరులున్నారు.

సామాజిక సేవలో వాసవీ క్లబ్ ముందంజ


వీధి వ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : సామాజిక సేవలో నేరేడుచర్ల వాసవీ క్లబ్ ముందంజలో ఉందని ఆ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ వంగవీటి గురుమూర్తి అన్నారు. బుధవారం నేరేడుచర్లలో వాసవీ, వనిత క్లబ్ కార్యాలయాలను ఆయన సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాసవీ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ ట్రెజరర్ రాచకొండ విజయలక్ష్మి ఆర్థిక సహాయంతో వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసి మాట్లాడారు. వేసవిలో ఎండ తాపానికి తల్లడిల్లుతున్న వీధి వ్యాపారులకు రక్షణ గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయన్నారు. అనంతరం నేరేడుచర్లలోని శివాలయంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుండా రమేష్ బాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల నిర్వాహకులు బండారు వెంకటేశ్వర్లు, బండారు జ్యోతి, నూనె కిశోర్‌కుమార్, లక్ష్మణ్, శ్రీలత, పాలిశెట్టి సంధ్య, భాగ్యలక్ష్మి, అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వర్ రావు, ఆలయ ప్రధాన పూజారులు ఉగ్రదండి శివ ప్రసాద్‌శర్మ, గుడిసె రాధిక, ఇందిర, సువర్ణ, నటరాజ్, సత్యం, పుల్లయ్య, లక్ష్మమ్మ, లక్ష్మి, భారతమ్మ, ధనలక్ష్మి తదితరులున్నారు.

గోపాలపురంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని గోపాలపురంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా బుధవారం సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ చీకూరి రాజారావు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, గర్తన్యాసం, మూర్తిదర్శనం, అధివాహన హోమం, మధ్యాహ్నం 2 గంటలకు మహాపూర్ణాహుతి, యజ్ఞేశ్వరపూజ, అష్టదిక్షు బలి ప్రధానం, కలశోధ్యాసనం, అవబృందం, ఆశీర్వచనం, పండితసత్కారం, యజ్ఞప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి దేశానికే తలమానికం


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : సీఎం కేసీఆర్ పాలనలో జరుగుతున్న రాష్ట్ర అభివృద్ధి దేశానికే తలమానికంగా నిలుస్తోందని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 21వ వార్డులో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న ఆరెకటిక భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసిన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. గత పాలకుల పాలనలో కులవృత్తులు నిరాదరణకు గురయ్యాయని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ కులవృత్తులను, వృత్తిదారులకు ప్రోత్సహిస్తూ రూ.లక్ష రుణాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, నాయకులు రహీం, ఆరెకటిక సంఘం నాయకులు పండరినాథ్, కామేకర్ శంకర్లాల్, నాగయ్య, పజన్లాల్, రవీందర్, ఈశ్వరీ, బాలాజీ, మహేష్, గణేష్, రాజేష్, నరేష్, సాయికుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక పథకం అమలు చేయాలి


కోదాడలో రైతు చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త గోపయ్య

కోదాడరూరల్ : ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక పథకం అమలు చేయాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త ఎం.గోపయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ స్థలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 60 సంవత్సరాలుగా మనం రసాయనాలు వినియోగించి వ్యవసాయం చేస్తుండటంతో భూసారం, పర్యావరణం దెబ్బతింటున్నాయన్నారు. వ్యవసాయానికి పురుగుమందుల వినియోగంతో ప్రజలు రోజురోజుకూ రోగాల పాలవుతున్నారన్నారు. ప్రస్తుత తరం, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అలాఏ క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యం చేసేవారు లేరని, కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక పథకం అమలు చేసి, ప్రతి గ్రామంలో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ సందర్భంగా రైతులను చైతన్యం చేసేందుకు తాను స్వచ్ఛందంగా నడిగూడెం, మునగాల, అనంతగిరి, చిలుకూరు, కోదాడ మండలాలలోని 60 గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర చేసినట్లు పేర్కొన్నారు.

జూలై మొదటి వారంలోనే సాగునీరు విడుదల చేయాలి


మాట్లాడుతున్న రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు

చిలుకూరు : జూలై మొదటి వారంలోనే సాగర్ నీళ్లు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం మండల అధ్యక్షుడు అలసకాని వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం చిలుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సకాలంలో నీళ్లు విడుదల చేస్తేనే రైతుకు మేలు జరుగుతుందని అన్నారు. రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలతో పాటు జింక్ బస్తాలు కూడా పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలని అన్నారు. రైతు బంధు సకాలంలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లు నాగయ్య, సొందుమియా, నరసింహారావు, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

మునగాల : వేసవిలో వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వీరశేఖర్, సహాయ కార్యదర్శి కాసర్ల రాజేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వరికొయ్యలకు నిప్పు పెట్టడం వలన జరిగే అనర్థాలపై అధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వరి కొయ్యలు కాల్చడంతో భూసారం దెబ్బ తిని పంట దిగుబడే తగ్గే అవకాశం ఉందని, వరికొయ్యలను దుక్కిలో దున్నడం మూలంగా పంటలకు పోషకాలు సమృద్ధిగా అందడం మూలంగా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రజాప్రతినిధులు

తుంగతుర్తి: తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష హారతి కార్యక్రమానికి వచ్చిన వారికి మాత్రమే ఉపాధి హామీ పనిలో హాజరు వేస్తామని బెదిరించి కూలీలను తరలించారన్నారు. ప్రభుత్వ అధికారులను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గాజుల మహేందర్, కత్తుల నరేష్, నాగరాజు, మధు, లక్ష్మణ్, శ్రీకాంత్, నవీన్ తదితరులున్నారు.

స్వరాష్ట్రంలో సాగులోకి బీడు భూములు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : స్వరాష్ట్రంలో బీడు భూములను సాగులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగు నీటి దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి కావాల్సిన సాగునీటిలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, మిషన్ కాకతీయ వంటి పనులతో లక్షల ఎకరాల భూములకు సాగు నీరందించడంతో రాష్ట్రం సశ్యశ్యామలంగా మారిందని తెలిపారు. కోదాడ నియోజకవర్గం సాగర్ ఆయకట్టులో ఉన్నప్పటికీ మునగాల, నడిగూడెం, మోతె మండల్లాని కొన్ని గ్రామాలకు సాగు నీరు అందకపోయేదని ఇప్పుడు ఆ మండలాలకు ఎస్ఆర్ఎస్పీ నీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి వసతులతో రాష్ట్రంలో కోటి ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు చింత కవితారాధారెడ్డి, యాతాకుల జ్యోతిమధుబాబు, చందూరు వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ, ఎస్ఈఈ నరసింహారావు, ఈఈ సత్యనారాయణ, డీఈలు సువర్ణరేఖ, స్వప్న, ఆనంద్, రాంప్రసాద్, ఏఈలు తదితరులు ఉన్నారు.

దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


నీటిపారుదల రంగం ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా ఎదిగిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరా సెంటర్ నుంచి ఎద్దుల బండ్లతో ర్యాలీ నిర్వహించి ముత్యాలమ్మ గుడి, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బతుకమ్మ ఆడారు. నీటిపారుదల రంగంలో ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను సాధించామన్నారు. ఈ తొమ్మిదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వినూత్న పథకాలు అమలు చేస్తూ అన్ని రంగాలలో అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో రైతాంగానికి విశ్వాసం కలిగించారన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసిన ఉమ్మడి జిల్లా గత 4 ఏళ్లుగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా ఎదిగిందని తెలిపారు. గత తొమ్మిది ఏళ్లలో నియోజకవర్గం అన్ని రంగాలలో ప్రగతి సాధించిందని చెప్పారు. ఈ అభివృద్ధిని ప్రజలందరికీ తెలిపే బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు అధికారులందరిపై ఉందని అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 18 లబ్ధిదారులకు మంజూరైన రూ.24.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారికి అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, డీపీఓ యాదయ్య, ఇరిగేషన్ ఎస్ఈ నర్సింహారావు, ఈఈ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు గెల్లి అర్చన రవి, జయబాబు, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, పార్వతి, వెంకటరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి


చిలుకూరు : నారాయణపురం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మఠంపల్లి : యాతవాకిళ్లలో చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

చిలుకూరు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా మండల వ్యాప్తంగా గురువారం జరిగే చెరువుల పండుగ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండుయాదవ్ కోరారు. బుధవారం మండలంలోని చెరువుల వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. మండలవ్యాప్తంగా 8 చెరువుల వద్ద చెరువు పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. చెరువు పండుగ సందర్భంగా గ్రామంలో బతుకమ్మ సంబురాలు, చెరువు వద్ద రాత్రి లైటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగకు సర్వం సిద్ధం

మఠంపల్లి : మండలంలో గురువారం నిర్వహించబోయే ఊరూర చెరువుల పండుగకు సర్వం సిద్ధం చేసిన్నట్లు ఎంపీడీఓ జానకిరాములు తెలిపారు. బుధవారం మండలంలోని యాతవాకిళ్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌తో పాటు అల్లీపురం, బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు, తదితర గ్రామాలలోని ఊరచెరువుల కట్టలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంబరాలు జరిపేందుకు అన్ని శాఖల నుంచి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, సర్పంచ్‌లు లక్ష్మీనరసింహరాజు, కోళ్లపూడి వెంకయ్య, కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.


నడిగూడెంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

చెరువుల పండుగపై సమీక్ష

నడిగూడెం : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న చెరువు పండుగను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. చెరువుల పండుగ కార్యక్రమానికి నడిగూడెం నీటి పారుదల శాఖ డీఈ ఇన్‌చార్జ్ అయి ఉండి విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ బాణాల కవిత, తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్రలింగారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న ‘బడిబాట’


చిలుకూరు : రామాపురంలో ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


నేరేడుచర్ల : కందులవారిగూడెంలో..

చిలుకూరు : మండలంలోని రామాపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఐఆర్పీ పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ సోమయ్య, వైస్ చైర్మన్ కాశమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిది

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో కందులవారిగూడెం గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బట్టు మధు, కందులవారిగూడెం పాఠశాల హెచ్ఎం చందమళ్ల వెంకన్న మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేము సాగర్‌రెడ్డి, కార్యదర్శి శివకృష్ణ, మరళిధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాంసైదులు, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి తదితరులున్నారు.


నడిగూడెం : సిరిపురంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధి హామీ పనుల వద్ద బడిబాట

నడిగూడెం : మండలంలో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. బుధవారం సిరిపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులున్నాయని, అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు ఉమావతి, అశోక్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి, అక్షపతి, బీవీచారి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.